# మెట్లు

ఏ. శ్రీధర్




వెుట్లు!

ఏం మెట్లు ఇవి!

తరతరాలుగా మనుషులలోని ఔన్నత్యానికీ, అంతస్తులకీ కొలత బద్దలుగా గుర్తింపబడుతున్నా, అదేం చిత్రమో! ఎక్కేవారికీ, దిగేవారికి ఒకేవిధంగా ఉపకరిస్తాయి ఇవి!

చూడడంతోనే హృదయస్పందన కలిగించేటంత-ప్రాముఖ్యం వీటికి లేకపోయినా, నా జీవితంలో ఈ మెట్లు ముద్రవేసిన అనుభూతిని యెలా మరిచిపోగలను. అయినా అదంతా వివరించి చెప్పాలంటే—

సరిగా మూడు నెలల క్రిందట,'షాలిమార్' రైల్వేకాలనీలో నాలుగంతస్తుల మేడలో, నాలుగవ అంతస్తులో, ఒక భాగంలో ఉన్న శ్రీనివాసరావుగార్ని కలుసుకోమని, నాన్నగారు మరీమరీ చెప్పిన మాట తీసెయ్యలేక, ఒక ఆదివారంనాడు తీరిక చేసుకొని, వాళ్ళింటి మెట్లు యెక్కుతున్నప్పటి నుంచి మొదలు పెట్టాలి.

శ్రీనివాసరావుగారు మా హెడ్ ఆఫీసులో మంచి పొజిషన్‌లో ఉన్నారని, అతనిని కలుసుకొంటే 'క్వార్టర్స్' లభించే విషయంలో ఏమైనా సహాయం చెయ్యగలరనీ, నాన్నగారు పోరు పెట్టడంతో ఇష్టంలేకపోయినా అతనిని కలుసుకోవడానికి రాజీపడవలసి వచ్చింది.

మా కోసమని రైల్వే వాళ్ళు కట్టిన 'ఇళ్లు' పరిమితం కావడంవల్ల ఎవరెవరికి 'సేంక్షన్' చేయాలన్న విషయం మీద ఆఫీసుల్లో గూడుపుఠాణీ జరుగుతున్న రోజులవి. అందుకని ముందుగానే మేల్కొనకపోతే, కలకత్తాలో ఇల్లు కోసం నానాగడ్డీ కరవాల్సిన రోజులు వస్తాయన్న భయంచేత నాన్నగారి మాటలకు విధేయత నటించాల్సి వచ్చింది.

ఆ ఇంటి మెట్లు ఎక్కుతున్నప్పుడు నాకు కలిగిన ఆలోచనలు ఏమని చెప్పగలను! రెండు అంతస్తులు ఎక్కానో లేదో అప్పుడే నాకు ఇల్లు దొరికినట్లు, ఆ మెట్లు ఎక్కుతూ—నా ఇంటికే నేను వెళుతున్నట్లు, వింత అనుభూతి కలిగింది.

'సుశీల, సుజాత, విమల, ప్రభావతి....' నేను ఇంటికి చేరుకుని తలుపు కొట్టేసరికి తలుపుతీసి సాదరంగా లోనికాహ్వానించే 'నవ వధువు' రూపంలో వీళ్ళల్లో ఎవరిని వూహించుకోవాలో తెలియక ఉక్కిరి బిక్కిరవుతూ— శ్రీనివాసరావుగారి ఇంటి కాలింగ్‌బెల్ నొక్కాను.

నవవధువు రూపంలో కాకపోయినా, పదహారు, పదిహేడులో వున్న చక్కని కన్నెపడుచు తలుపు తీసేసరికి మెరుపు కొట్టినట్లయింది.

ఆ అమ్మాయి వెనుకనే శ్రీనివాసరావుగారు కూడా వచ్చేరు, "ఎవరు కావాలండీ!" అంటూ.

'నా పేరు, నాన్నగారి పేరు చెప్పేసరికి, కాఫీ, టిఫిన్ అంటూ కూర్చోబెట్టి భోజనం కూడా చేసి వెళ్ళనిదే ఒప్పుకొన్నారు కారు అతను. వెళ్ళిన పనికూడా సగానికి సగం అయిపోయినట్లే అనిపించింది నాకు అతని ఆదరణ, ఆప్యాయత చూసి.

శ్రీనివాసరావుగారికి మగపిల్లలంటూ ఎవరూ లేరు. ఉన్న ఆరుగురూ ఆడపిల్లలే. అతనూ అతని భార్య కూడా చక్కని వాళ్ళే కావడం చేత పిల్లలందరూ చూడడానికి ఆకర్షణీయంగా ముద్దుగా వున్నారు. తలుపు తీయడానికి వచ్చిన

అమ్మాయే వాళ్ళ పెద్ద పిల్లట. పేరు నిర్మల. ఆ తరువాత అమ్మాయిని చదువుకోసమని వాళ్ళ మామయ్య దగ్గర వుంచేశారట.

తిరిగి వచ్చేలోగా శ్రీనివాసరావుగారు చెప్పిన విషయాలివి. మళ్ళీ-మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళకుండా ఉండలేననిపించింది నాకు, ఆ ఇంటి నుండి తిరిగివచ్చాక.

ముఖ్యంగా తలుపు తీస్తూ నా కళ్ళల్లోకి సూటిగా రెండు క్షణాలపాటు చూసిన నిర్మల ముఖాన్ని మరిచిపోలేను నేను.

ఆ తరువాత రావుగారింటికి రెండు మూడు సార్లు వెళ్ళినా నిర్మలని ఒంటరిగా కలుసు కొన్నది హౌరామైదాన్‌లో రథయాత్రని చూడ డానికి వెళ్ళినప్పుడే.

జగన్నాథరథానికి ఎన్ని చక్రాలుండాలో, చక్రానికి, ఎన్ని ఆకులు వుండాలో, ఎన్ని మెట్లు వుండాలో వివరంగా చెప్పుకుపోతున్న ఒరియా స్నేహితుని మాటలు పరధ్యానంగా వింటూ, దిక్కులు చూస్తున్న నాకు, నిర్మల హఠాత్తుగా ఒక బొమ్మల దుకాణం ముందు కనిపించింది.

అదేదృష్టితో చెప్పుకుపోతున్న స్నేహి తుణ్ణి అలాగే వదిలి, మెల్లిగా జనం మధ్యలో కలిసిపోయి,నిర్మల వెనుకగా వెళ్ళి నిలబడ్డాను.

"ఏం బొమ్మలు కావాలి! నిర్మలా!"

ఒకసారి తృళ్ళిపడి నా వైపు బెదురు చూపులు చూసింది నిర్మల. ఆ సమయంలో ఏకహాయన కురంగలోచనాలు జ్ఞప్తికి వచ్చాయి ఆ పిల్ల కళ్ళల్లో బెదురు చూసి.

వాటి ఆకర్షణకి సులభంగా లొంగిపోయిన నేను, స్నేహితురాలి బలవంతం మీద అలా వచ్చాననీ, అంతకు ముందెప్పుడూ ఆ పరిసరా లకి రాలేదనీ, యింకా ఏదో చెప్పుకుపోతున్న నిర్మల మాటలు వినిపించుకోకుండా "ఇలారా నిర్మలా!" అంటూ తీసుకు పోసాగాను.

నిర్మల బిక్కచచ్చిపోయింది. ఏమనడానికీ, ఏదీ చెయ్యటానికీ ఆమెకి తోచలేదనుకుంటా, మౌనంగా నన్ను అనుసరించింది.

ఎదురుగా వున్న 'మర్కెంటైల్ బ్యాంక్' క్రొత్త బిల్డింగ్‌కేసి దారితీశాను. 'లిఫ్ట్'లో మీది



కుటుంబనియంత్రణ సరేగానీ, నా తొమ్మిదో సంతానం మంత్రి అవుతాడని ఇద్దరు జ్యోతిష్కులు చెప్పారు!

అంతస్తు దాకా వెళ్ళి అక్కడ నుండి మెట్ల మీదుగా డాబామీదికి వెళ్తే అంత జనసమ్మర్ధం లోనూ ఏకాంతం లభించగలదనే ఉద్దేశంతో.

'లిఫ్ట్'లో నిలుచున్నప్పుడు కూడ నిర్మల ఏమీ అనలేదు. భయం భయంగా నా వైపు చూడటం తప్ప. విపరీతమైన ఆవేశానికి బానిస నైన నేను అవేవీ గమనించే స్థితిలోలేను. ఆ సమయంలో నా మెదడు నిండిన ఆలోచనలు నన్ను యుక్తాయుక్త వివేచనా శూన్యుణ్ణిగా చేసి వేశాయి.

మేడ మెట్లు ఎక్కేటప్పుడు మాత్రం నిర్మల వెర్రికేక పెట్టింది. ఇంచుమించు నా మీద వాలిపోయింది. ఆ పిల్ల ముఖం, ముంగు రులు చెమటతో పూర్తిగా తడిసిపోయాయి. కమలాపండు తొనల్లాంటి పెదాలు భయంవల్ల విపరీతంగా వణికిపోసాగాయి. ఇంకాసేపు అలాగే ఉంటే స్పృహతప్పి పోతుందేమో నన్న భయం వేసింది.

"ఇంటికి పోదామా నిర్మలా!" మెల్లగా అన్నాను.

ఆ మాట అనడమే తడవుగా, ఆమె కళ్ళల్లో మెరుపు గోచరించింది. నా భుజాన్ని గట్టిగా పట్టుకుని పదండి పోదాం అన్నది.

'లిఫ్ట్' నుండి క్రిందకు దిగి, షాలిమార్ పోయే బస్సు పట్టుకున్నాం ఇద్దరమూ. బస్సు రద్దీగా ఉండటంవల్ల నిర్మలకి మాత్రం సీటు దొరికింది. నేను ఎదురుగానే నిలబడ్డా ఆమె ముఖాన్ని సూటిగా చూడలేక పోయాను. ఆ అమ్మాయిని నేను చేయదల్చుకొన్న పద్ధతికి నా మీద నాకే వెర్రి కోపం వచ్చింది.

శ్రీనివాసరావుగారి ఇంటి పరిసరాలకి వెళ్ళే సరికి అతని యింట్లో లైట్లు వెలుగుతూండటం అతను బాల్కనీలో తచ్చాడుతూండడం కని పించింది. నిర్మల కోసమే ఎదురుచూస్తున్నా రని గ్రహించడానికి ఎక్కువసేపు పట్టలేదు.

ఆ రాత్రంతా కలత నిద్రతోనే గడిచింది. కలలనిండా దెయ్యాలు, వాటి వికటాట్టహాసాలు, జేమ్స్‌బాండ్ మార్క్ ఫైటింగ్‌లూ, రైలు పట్టాలలాంటివే కనిపించాయి.

మర్నాడు సాయంత్రం భోజనం చేయ డానికని హౌరాస్టేషన్‌కి వెళ్ళిన నాకు అకస్మా త్తుగా బాబాయి, పిన్ని ఎదురయ్యారు. కనెక్షన్ ట్రైన్ లేటయిపోయినందువల్ల 'డూన్' ఎక్స్ ప్రెస్ దొరకలేదనీ, అంతవరకు ఏంచెయ్యాలా అన్నదే ఆలోచిస్తున్నానని చెప్పాడు బాబాయి.

ఆ రోజు ఉదయమే ఇల్లు దొరికినట్లు ఆర్డర్స్ తీసుకొన్న నేను తడుముకోకుండా క్రొత్త యింటికి ఆహ్వానించాను ఇద్దరినీ.

మరుసటి రోజు వెళ్ళిపోవాల్సిన బాబాయి, పిన్ని బలవంతం మీద కలకత్తా చూడడానికి

రెండు మూడు రోజులు ఆగిపోటానికి నిశ్చయించుకున్నాడు.

ఈస్టరన్ రైల్వే బుకింగ్ ఆఫీసు దగ్గర చచ్చీ-చెడి, చివరకి పిన్నికీ బాబాయికీ రెండు సీట్లు రిజర్వ్ చేయించి-ఇంటి ముఖం పట్టిన నాకు మెట్ల దగ్గర 'పార్క్' చేసిన-శ్రీనివాస రావుగారి సైకిలు కనిపించింది.

తనంతట తనే నాకు ఇల్లు దొరికిన వైనం తెలిసి-చూడడానికి వచ్చారన్నమాట! ఛ! ఎన్నడూ లేనిది ఇంత అల్పుడినయి పోయానేమిటి! అతని ద్వారానే ఇల్లు రాబట్టి ఆ మాట అతనితో స్వయంగా చెప్పేపాటి కృతజ్ఞత అయినా నాలో లేక పోయిందేం!

ఆలోచిస్తూ మేడ మెట్లు ఎక్కుతున్న నాకు డాబా మీదికి వెళ్ళే మెట్ల మలుపులో ఎఱ్ఱని పరికిణీమీద పట్టు హంసలబారు కనిపించి, షాక్ కొట్టినట్లయింది.

రావుగారితోపాటు నిర్మల కూడా వచ్చిందా! రెండు అంగల్లో ఇంటి ముంగిట చేరుకొని, తలుపు సందుల్లోంచి లోపలికి చూసాను. బాబాయితో పరిసరాల్నే మరచి పోయేంత బాతాఖానీలో పడ్డారు రావుగారు.

లోపలికి వెళ్దామనుకొన్న నేను ఒక్క-క్షణంలో నిర్ణయాన్ని మార్చుకొని, డాబా మీదికి వెళ్ళాను. నిజానికి ఆనాడు జరిగినదానికి నిర్మలకి, క్షమాపణలు చెప్పుకోడానికే వెళ్లాను.

నేను వెళ్ళేసరికి డాబా పిట్టగోడ దగ్గర నిల్చొని నిర్మల ఎటో చూస్తోంది. నీటిని నిలవ చేయడానికని కట్టిన రెండు వాటర్-టాంకుల మధ్యనుండి, నిండు వసంతంలో ఉన్న, అరుదైన అంద-చందాలు గల అమ్మాయి ఎటో పరధ్యానంగా చూస్తూ తనను తానే మరచి పోయిన భంగిమచూసి, అసలే బలహీనమైన నా మనస్సు ఆ దృశ్యానికి దాసోహం చెయ్యకుండా ఉండ లేకపోయింది.

వెనుకగా వెళ్ళి నిర్మల రెండు కళ్ళు మూసాను. తృళ్ళిపడిన నిర్మల బలంగా నా చేతులు విడిపించుకొని నన్నుచూసి కట్రాపే అయింది. ఆ తరువాత కొన్ని క్షణాలకి తేరుకొని చిత్రంగా కేకవేసి, రెండు చేతులతోనూ నా కంఠాన్ని గట్టిగా పెనవేసుకొంది. ఆ పెనవేసుకోడంలో, ఏ విధమైన రక్తిమ లేకపోగా, ఏదో పిచ్చిదాని చేష్టలా, అనిపించింది నాకు. అయినా దొరికిన అవకాశాన్ని జార విడువకుండా ఆమెని గట్టిగా అదుముకొని ముఖాన్ని పైకెత్తాను, ఆమె అందమైన ముఖంలోని అనంతమైన సౌందర్యాన్ని తనివితీరా చూడాలన్న లాలసతో.

అంతే!

ఎక్కడలేని బలంతో నన్ను 'వాటర్ టాంక్' మీదికి నెట్టివేసి, గబగబా మెట్లకేసి పరుగెత్తింది నిర్మల.

నేను తేరుకొని ఆమెని వెంబడించేసరికి, వేగంగా మలుపు తిరుగుతున్న మెట్లమీద నుండి జారి; దోసకాయల బస్తాలా, దొర్లి పోయి మూడవ అంతస్తు బాల్కనీమీద కెవ్వుమని కేకవేస్తూ దబ్బున పడింది.

ఆమె దగ్గరగా వెళ్ళి చూడ సాహసం లేకపోయింది నాకు. మా ఇద్దరినీ ఆ స్థితిలో చూసిన వారెవరైనా సులభంగా జరిగిన విషయాన్ని ఆకళింపు చేసుకోగలరు. అందులో బాబాయి, రావుగారు ఇద్దరూ ఒకచోట ఉన్నారు. ఆ డాబామీదినుండి పిట్టగోడ దాటి; ప్రక్క మేడ మీదికి వెళ్ళి ఆ మేడ మెట్లు దిగి రోడ్డుమీదపడి కాసేపు అలసట తీర్చుకొన్నాను. తరువాత ఏమీ తెలియని వాడిలా మెల్లగా అడుగులు వేసుకొంటూ ఇంటికి నడక సాగించాను.

నన్ను దూరంనుండే చూసిన బాబాయి గట్టిగా కేకవేసాడు, "ఒరేయ్! వెంటనే వెళ్ళి టాక్సీ తీసుకురా! నిర్మల మెట్లమీద పడి పోయింది" అంటూ.

మరో గంటలోగా నిర్మలని హాస్పిటల్‌లో జాయిన్ చేయడం జరిగింది. దెబ్బ పెద్దదేమీ కాదనీ, దెబ్బవల్ల కంటె ఎక్కువ భయం వల్లనే అమ్మాయి కలా స్పృహ తప్పిందనీ డాక్టర్ హామీ ఇచ్చిన తరువాత నేను రావుగారి బలవంతంమీద అతని ఇంటికి వెళ్ళాను.

నన్నొక కుర్చీమీద కూర్చోమని చెప్పి, గట్టిగా నిట్టూరుస్తూ, నుదుట పట్టిన చెమట తుడుచుకొంటూ కూర్చున్నారు రావుగారు.

"ఫరవాలేదు లెండి. డాక్టరు చెప్పాడుగా! పెద్ద దెబ్బేమీ కాదు" అన్నాను నేను. ఆ మాట ఎలా అనగలిగానో తలచుకొంటే ఇప్పటికీ ఆశ్చర్యం వేస్తుంది నాకు.

"అది కాదు బాబూ! నేను చింతించేది. ఆ దెబ్బ మళ్ళా నిర్మలమీద ఏమైన మార్పు తీసుకువస్తుందేమోనని...."

"మళ్లానా, అంటే...." కుతూహలంతో అడిగాను.

రావుగారు కొన్ని లిప్తలపాటు మౌనం వహించి మెల్లగా మొదలు పెట్టారు.

"మా రెండో అమ్మాయి కమలని చూడలేదు కదూ నువ్వు! అది వాళ్ళ మామయ్య దగ్గర చదువు కొంటోంది. అది నిర్మల కన్నా రెండేళ్ళు చిన్న అయినా మంచి ఏపరి. పదమూడేళ్ళకల్లా ఎదిగి పోయింది, 'నిమ్మీ' కన్నా ముందుగా. పేరంటానికి వచ్చిన ముత్తైదువలందరూ, వచ్చినవాళ్ళు వచ్చినట్లు వెళ్ళకుండా, తలొక మాట అనిపోయారు. 'పెద్ద దాని'కన్న, రెండోది ముందుగా పుష్పవతి అవడానికి ఆశ్చర్యం వెలిబుచ్చుతూ. ఆ మాటలు 'నిమ్మీ' మెదడులో షాక్ తెచ్చిపెట్టాయి. ఎప్పుడూ మందకొడిగా, ఏదో కోల్పోయినట్లు, మరిచి పోయినట్లు ఉండేది. మందులివ్వడంతో, అది కాస్తా ముదిరి, చిన్న సైజు ఉన్మాదానికి దారి తీసింది. మేమంటే కాస్త భయం ఉన్నా, 'కమల'మీద కక్ష కట్టింది. దాని బట్టలు చింపేయడం, గొంతు నులమడం వంటి చేష్టలు మొదలెట్టింది. దాంతో ఇద్దరినీ విడదీయడమే మంచిదనే అభిప్రాయంతో చదువు నెపంమీద కమలని వాళ్ళ మామయ్య దగ్గరకి, పంపించి, నిర్మలకి మంచి స్పెషలిస్టుల ద్వారా ట్రీట్‌మెంటుచేయించాను. దానికి తోడు మా క్రింది వాటాలో 'వామనరావు' అని ఒక కుర్రాడు ఉండేవాడు. అంటే ఆ ఇల్లు అతనికి దొరికింది కాదు, 'అన్ ఆథరైజ్డ్ ఆక్యుపేషన్' అన్నమాట. అతనికీ, మా నిమ్మీకీ స్నేహం కలిసింది. కథలు, కబుర్లు చెప్పి 'నిమ్మీ'ని ఆకర్షించాడతను. అది ఎలాగైనా మనుషుల్లో పడితే చాలని మేము అడ్డుపెట్టే వాళ్ళంకాదు.

క్రమంగా దానితో స్నేహం చేసుకొని మోసం చేశాడతను-" రావుగారి కంఠం గాద్గదికమైంది. కాస్సేపు ఆగి, గ్లాసుడు మంచి నీళ్ళు తాగి తిరిగి మొదలెట్టారాయన, "ఒకరోజు ఇలాగే నిమ్మీ కేక వినిపించింది. పరుగెట్టుకొని వెళ్లాం. మెట్లక్రింద ఖాళీ జాగాలో 'నిమ్మీ' పడిపోయి ఉంది. బట్టలు బాగా నలిగి పోయి ఉన్నాయి. పరికిణీ మీద రక్తపు జాడలుకూడా కనిపించాయి....ఆపైన డాక్టరు సలహామీద 'వెల్లూరు' తీసుకొని వెళ్ళాం. అక్కడే నిర్మలకి చాల మట్టుకు నయమయింది. తరువాత పుష్పవతి కూడా అయింది...."

"మరి ఆ వామనరావు...."

రావుగారి పిడికెళ్ళు గట్టిగా బిగుసుకున్నాయి. "పారిపోయాడు. ఎక్కడ పని చేస్తున్నాడో కూడా నేను ముందుగా తెలుసుకోలేదు."

* * *

"ఏమండోయ్! మిమ్మల్నే!"

'బడాబజార్' దిక్కుగా హౌరాబ్రిడ్జి మీద నడుస్తున్న నేను ఉలిక్కిపడి వెను తిరిగి చూసాను. వంతెన కమ్మీల నానుకొని నిల్చొన్న అతను నన్నే పిలుస్తున్నాడు.

ఎప్పుడూ చూసిన జ్ఞాపకమైనా లేదు! ఎవరితను! ఆశ్చర్యపోతూ ఆ వ్యక్తికేసి నడిచాను.


"క్షమించాలి సార్! నేనెవరో మీకు తెలియక పోవచ్చు. ఆ మాట కొస్తే మీరెవరో నాకు కూడా తెలియదు. ఇదుగో ఈ ఫొటో ద్వారానే మిమ్మల్ని పోల్చుకోగలిగాను" తన చేతిలో ఉన్న నా ఫొటోని చూపిస్తూ అన్నాడతను.

"ఈ ఫొటో మీకెలా వచ్చింది?"

"మీ నాన్నగారు ఇచ్చినదే 'నరహరి'గారని మీ నాన్నగారి స్నేహితులు లెండి. అతను మా మామగారు అవుతారు...."

ఫొటో అతని చేతికి ఎలా వచ్చిందో అర్థమయింది నాకు, "మరి మీ పేరు...."

"వామనరావు అంటారండి" నవ్వుతూ అన్నాడతను.




'వామనరావు' ఛళ్ళుమని ఎవరో చరిచినట్లయింది ఆపేరు వినగానే.

"నేనిక్కడే 'సంతరాగాఛీ'లో ఉంటున్నాను, లెండి. మీరొక్కసారి మా ఇంటికి రావాలి. అక్కడ అన్ని సంగతులూ మాట్లాడుకోవచ్చు.ఇక్కడ చెప్పుకోవడం బాగుండదు."

"రేపు ఆదివారమేగా! తొమ్మిది గంటలకల్లా మీ ఇంటికి వస్తాను. 'సంతరాగాఛీ'లో మీ ఇల్లెక్కడ!"

"రామమందిరం దగ్గర్లోనే ఉంది లెండి. నాపేరు చెప్తే ఎవరైనా చూపిస్తారు."

'పేరుచెప్తే ఎవరైనా చూపిస్తారట. అంత పరిచయమైన పేరు కాబోలు. అయినా ఈ వామనరావు, ఎవరో తెలుసుకోవాలి!' అనుకొంటూ, అతని దగ్గిర సెలవు తీసుకొని బజారువైపు నడక సాగించాను.

మర్నాడు ఉదయమే నీట్‌గా డ్రెస్ చేసుకొని వామనరావు ఇంటికి బయలుదేరాను. వామనరావు, అతని భార్య, నా కోసమే ఎదురు చూస్తున్నారులా ఉంది. అతని ఇల్లుకూడ మెట్లమీద రెండో అంతస్తులో ఉంది.

కాఫీ వగైరా పూర్తయేసరికి, వామనరావే ముందు మాట్లాడాడు. "చూడండి సార్! 'నరహరి' గారన్నానే, అతను మా మామగారు...."

"ముందుగానే చెప్పారు లెండి."

"భలేవారే!" అంటూ నవ్వేశాడు అతను. "మాకో మరదలుపిల్ల ఉన్నాదండి, 'భానుమతి' అని పి. యు. సి. చదువుతోంది. ఆ పిల్ల పెళ్లికోసమని మా మామగారు మీ నాన్నగారితో మాట్లాడారట. మీ నాన్నగారు..."

ఈ రకం సంభాషణ విసుగెత్తింది నాకు. చికాకుగా, "విషయం తెలిసిపోయింది లెండి" అన్నాను.

వామనరావు మునుపట్లాగే నవ్వేశాడు. "మరి మీ కిష్టమయితే...."

"ఆ పాప మీ పాపేనా!" మధ్యలో అడిగాను నేను. ఇంట్లో ఒక మూలగా బొమ్మలతో ఆడుకొంటున్న మూడేళ్ళ పాపనిచూసి, విషయం మారుస్తూ.

"అవునండి."

"నీ పేరేమిటి పాపా!" ఎక్కడలేని ఆప్యాయత తెచ్చి పెట్టుకొంటూ అడిగాను.

"అబ్బే!మాట్లాడ లేదండి! పాప మూగది!" వామనరావు కంఠంలో జీఱ ధ్వనిందింది.

"అరరే! పేరేమిటి!"

"నిర్మల...."

మంచుగడ్డ తీసి బలంగా తలమీద కొట్టినట్లయింది నాకు. పాపపేరు నిర్మలా! సందేహంలేదు. ఈ వామనరావు - ఆ వామనరావే!

గభాలున కుర్చీలోంచి లేచి, బయటకు వచ్చాను. వామనరావు నా చర్య అర్థంకాక నా వెనుకనే వచ్చాడు.




"చూడండి వామనరావుగారూ!"

వామనరావు ఆతృతగా నా వంక చూశాడు.

"ఆ మూల మెట్ల వెనుక మలుపుకేసి చూడండి. దానిని చూస్తే మీకేమీ జ్ఞాపకం రావడం లేదూ!"

నా మాటలు అతనిమీద బాగా పనిచేశాయి. వామనరావు స్థాణువు అయి నా ముఖం వంక చూడసాగాడు.

"సా....సార్!" అతని కంఠం వణికింది.

నేను గబగబా మెట్లు దిగి క్రిందికి వచ్చేశాను. అంతకన్నా అతనితో ఎలా మాట్లాడాలో, ఏం చెయ్యాలో తోచక.

నా వెనుకనే కొంతసేపటికి అతను కూడ దిగి వచ్చాడు. "సార్ ఒక్కమాట వినిపోండి సార్!" అంటూ.

నేను అయిష్టంగానే ఆగాను.

"నేను నిర్మల పట్ల చాలా అన్యాయంగా ప్రవర్తించాను. దానికి తగిన ఫలితం అనుభవిస్తూనే ఉన్నాను. ఆ మూగపిల్లను- చూశారా సార్! అది నా పాపానికి ఫలితం. దానికి నిర్మల పేరే పెట్టాను. పాపని ఆ పేరుతో పిలుస్తూ, నాలో నేనే రోజూ - కుమిలిపోతూ ఉంటాను. అంతకన్నా నాకు నిష్కృతి లేదు...." వామనరావు కండ్లలో నీళ్ళు నిలిచాయి. అతను తను చేసిన పనికి నిజంగానే బాధపడుతున్నాడు. వామనరావుని ఆ అవస్థలో- చూడగానే ఒక్కసారి చలించిపోయాను నేను.

"చూడండి రావుగారూ! నేను జరిగినదానికి మిమ్మల్ని శిక్షించటానికి రాలేదు. పోతే! మీ మరదల్ని ఇక్కడకి తెప్పించే- ఏర్పాటు చెయ్యండి. పిల్ల నచ్చినట్లయితే చేసుకోటానికి- నాకేమీ అభ్యంతరం లేదు," అప్రయత్నంగానే మాటలు దొర్లిపోయాయి, నా నోటి నుండి.

"మీరు నిజంగా దేవుడిలాంటి వారు సార్! నేను చేసిన పనికి చీదరించుకొని, ఈ సంబంధాన్ని కాదంటారేమో ననుకొన్నాను. మీరు నిజంగా...." వామనరావు గొంతుక మూగపోయింది. అతనికి ఏం మాట్లాడాలో తెలియడం లేదు.

పిచ్చి వామనరావు!

నేనేదో అతనికన్న పై మెట్టు మీద ఉన్నాననుకొంటున్నాడు. అతను చేసిన లాంటిపనే, నేను కూడా 'నిర్మల' పట్ల చేయబోయానని తెలిస్తే ఏమనుకొంటాడు!

అయినా తను చేసిన తప్పుకు, తనను తాను శిక్షించుకొన్న- తీరు, వేదనతో తప్తమయిన అతని హృదయం యొక్క-పవిత్రత ముందు, నేనెన్ని మెట్లు దిగువనుండాలి.

ఏమో!

వెను తిరిగి గబగబా నడిచిపోతున్న నేను వామనరావు-పిలుపు వినిపించి ఆగాను.

"సార్! నిర్మల.....నిమ్మి.....ఏమయింది సార్!"

"చనిపోయింది" మొట్టమొదటిసారిగా నా కంఠం గాద్గదిక మయింది.